

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (గురు)
సహరి : 4.45 (శుక్ర)

అనుమానిత సర్టిఫికెట్లపై కలెక్టర్‌కు నివేదిస్తాం

ఏలూరు అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):నకిలీ సర్టిఫికెట్లతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్లు, ఔట్‌సోర్సింగ్ ఎఫ్ఎన్‌వో ఉద్యోగాలు పొందేందుకు కొందరు అభ్యర్థులు దొడ్డిదారిన ప్రయత్నిస్తున్నారంటూ సోమవారం కలెక్టరేట్ ప్రజాస్పందనలో అందిన ఫిర్యాదు మేరకు చేపట్టిన ఉద్యోగార్థుల సర్టిఫికెట్ల పునఃపరిశీలన రెండో రోజు బుధవారం కొనసాగింది. నకిలీ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందనున్నారని ఆరోపణలు వచ్చిన ఉద్యోగార్థుల పేర్లను ఇవ్వాలని ఫిర్యాదుదారుడిని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు కోరడంతో మొత్తం 11 మంది వివరాలను అందజేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తెలిపారు. ఈ సర్టిఫికెట్ల నిర్ధారణ విద్యా శాఖ తేల్చాల్సి ఉన్నందున, ఆ మేరకు కలెక్టర్‌కు అభ్యర్థన లేఖను గురువారం అందజేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం మూడు వేల దరఖాస్తులు అందాయని, వీటి పునఃపరిశీలన ఎన్నిరోజులు పడుతుందో చెప్పలేమన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు

ఏలూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్న వేళ అంగన్‌వాడీ సెంటర్లకు బుధవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలను నిర్వహించాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ పి.శారద తెలిపారు. ఇవి మే 31వ తేదీ వరకు పనిచేస్తాయి. జిల్లాలో 2,215 అంగన్‌వాడీ కేంద్రాల్లో లక్షకుపైగా చిన్నారులు ఓనమాలు దిద్దుకుంటున్నారు.



ఆర్‌బీఐ ఎల్డీవో పూర్ణిమకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎల్‌డీఎం నీలాద్రి

బ్యాంకర్లు రుణ లక్ష్యాలను పూర్తిచేయాలి : కలెక్టర్

ఏలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ వెట్రిసెల్వి బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి డిసెంబరు వరకు రూ.6,639 కోట్లు స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను, ప్రాధాన్యతా రంగాలకు రూ.15,778 కోట్ల రుణాలకు గాను ఇప్పటి వరకు 13,277 కోట్లు అందించారన్నారు. నెలాఖరుకు నూరు శాతం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్‌డీఎం నీలాద్రి, నాబార్డు డీడీఎం అనిల్ కాంత్ పాల్గొన్నారు.

ఆర్బీఐ ఎల్డీవో పూర్ణిమకు వీడ్కోలు

జిల్లాలో రిజర్వ్ బ్యాంకు ఎల్‌డీవోగా విధులు నిర్వర్తించి కర్ణాటకకు బదిలీపై వెళుతున్న పి. పూర్ణిమను సత్కరించి వీడ్కోలు పలికారు. కలెక్టర్ వెట్రిసెల్వి, యూబీఐ రీజనల్ హెడ్ శ్రీనివాస్, తదితరులు అభినందించారు.



అభయాంజనేయస్వామికి మంత్రి లోకేశ్ పూజలు



మంత్రి లోకేశ్‌కు పూలబొకే అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని.. చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి

పెదపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృష్ణా జిల్లా మల్లవల్లిలోని అశోక్ లే ల్యాండ్ కంపెనీని ప్రారంభించడానికి వెళ్తూ మార్గమధ్యలో అప్పనవీడు అభయాంజనేయ స్వామిని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు కృష్ణా, ఏలూరు జిల్లాల కూటమి శ్రేణులతోపాటు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. పూజలు అనంతరం దేవాలయ అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి తీర్థప్రసాదా లు అందజేశారు. కలెక్టర్ వెట్రి సెల్వి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

ఏలూరు, కైకలూరు వైస్ ఎంపీపీలకు 27న ఉప ఎన్నిక

ఏలూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు ఎంపీపీ, రెండు వైస్ ఎంపీపీ పదవులకు, ఒక కో ఆప్షన్ సభ్యునికి ఉప ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. వీటిలో యలమంచిలి, అత్తిలి ఎంపీపీలకు, ఏలూరు రూరల్, అత్తిలి, కైకలూరు వైస్ ఎంపీపీ పదవులకు, పెరవలి కో ఆప్షన్ సభ్యుడి పదవికి ఎన్నిక జరగనుంది. వీటికి సంబంధించి 27వ తేదీ ఉదయం పది గంటలలోగా నామినేషన్ల స్వీకరణ, 12 గంటల్లోగా పరిశీలించి, అభ్యర్థులను ప్రకటిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఒంటి గంటలోగా గడువు విధించారు. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు.

మంచినీళ్లు ఇవ్వండి

డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించండి

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో డీపీవోకు సమస్యల మొర.. వీటి పరిష్కారానికి అనురాధ హామీ

ఏలూరు సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో నెలకొన్న సమస్య లపై ప్రజలు ప్రజా ప్రతినిధులకు విన్నవిస్తున్నా వాటికి సరైన పరిష్కారం లభించడం లేదు. ఈక్రమంలో బుధవారం డీపీవో కొడాలి అనూరాధతో నిర్వహించిన ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమం వారికి ఒక వేదికగా మారింది. గ్రామాల్లో మంచినీటి సమస్యలు, డ్రెయినేజీలు అధ్వానం, కుళాయిల నుంచి మురుగునీరు, జల్‌జీవన్ మిషన్, ఫిల్టర్‌బెడ్స్, ఆర్వో ప్లాంట్లు అధ్వానం, మంచినీటిలో ఫ్యాక్టరీ కాలుష్యాలు కలిసి నీరు కలుషితం కావడం తదితర సమస్యలను విన్నవించారు. డీపీవో స్పందిస్తూ వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని, కొన్ని సమస్యలను తానే స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.



వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్యలను పరిష్కారానికి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. ఎద్దడి ఏర్పడే ప్రాంతాలను గుర్తించి అక్కడకు మంచినీటి సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశించాం. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లాం. డ్రెయినేజీ, వీధి లైట్ల సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో ప్రజలు వెలిబుచ్చిన సమస్యలను ఆయా గ్రామాల కార్యదర్శులకు పంపించి తక్షణం వాటిని పరిష్కరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించాం.

- కొడాలి అనురాధ, జిల్లా పంచాయతీ అధికారి

తాగునీటి కోసం కష్టాలు..

- ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్, ఆర్వో ప్లాంట్ సక్రమంగా పని చేయక నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. మురుగు నీరు వస్తోంది. మంచినీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి.

జి. రామారావు, గురవాయిపాలెం, కలిదిండి మండలం

డీపీవో : ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామ కార్యదర్శికి ఆదేశాలు ఇస్తాం.

- మంచినీటి చెరువులోకి టైల్స్‌ఫ్యాక్టరీ నీరు ప్రవహించడం వల్ల నీరు కలుషితం అవుతోంది. ఆర్వో ప్లాంట్ మూతపడటం వల్ల సక్రమంగా నీరు సరఫరా కావడం లేదు. పైప్‌లైన్ ద్వారా మంచినీరు అందించాలి.

- కె.కృష్ణప్రసాద్, చిగురుకోట, ముదినేపల్లి మండలం

డీపీవో : ఆర్వో ప్లాంట్ తెరుస్తాం. నీటి కాలుష్య సమస్యను పరిష్కరిస్తాం.

- ఫిల్టర్ బెడ్స్ పనిచేయడం లేదు, రక్షిత మంచి నీటి పథకం బీటలు వారింది.

- ప్రసాద్, రామవరం, కైకలూరు మండలం

డీపీవో : ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి ఈ సమస్య పరిష్కరిస్తాం.

- మంచినీరు సరఫరా కావడం లేదు. కేవలం మురుగు నీరు వస్తోంది.

- మల్లిక, లోకమూడి, కైకలూరు మండలం

డీపీవో : ఎందుకు మురుగునీరు వస్తోందో పరీక్షలు చేయిస్తాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారు లకు ఈ సమస్యను విన్నవించి పరిష్కరిస్తాం.

- మా గ్రామంలో వాటర్ ట్యాంక్ లీక్ అవు తోంది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. వీధి లైట్లు తరచూ మాడిపోతున్నాయి. వాటర్ ట్యాంకుకు అసలు మెట్లు లేవు. వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేయడం లేదు.

- సుధాకర్, పోతునూరు శివారు ఉంగ్రాజవరం, దెందులూరు మండలం

డీపీవో : పరిశీలించి పరిష్కరిస్తాం.

- మా గ్రామంలోని జగనన్న కాలనీలో నీళ్ల సక్రమంగా రావడం లేదు. పరిష్కరించండి.

- కుమారి, యండపల్లి, చింతలపూడి మండలం

డీపీవో : ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపి తక్షణం పరిష్కరిస్తాం.

- మంచినీటి సదుపాయం సక్రమంగా లేదు. ప్రజా ప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదు. జల్‌జీవన్ మిషన్‌లో పైప్‌లైన్లను గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా వేయడం వల్ల నీరు సక్రమంగా రావడం లేదు. స్పందనలో ఈ సమస్యను విన్నవించినా పరిష్కారం కాలేదు. పంచాయతీ కార్యదర్శికి సమస్యను విన్నవించినా ఫలితం లేదు. జిల్లా అధికారిగా మీరైనా ఈ సమస్యను పరిష్కరించాలి.

- ఎం.సత్యసాయిరవికిరణ్, కోరుకొల్లు, పెదవేగి మండలం.

డీపీవో : ఈ సమస్యను పరిష్కరించడానికి వెంటనే చర్యలు చేపడతాం. గ్రామ కార్యదర్శికి ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశిస్తాం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఈ సమస్యను పరిష్కరించాలని విన్నవిస్తాం.

- మంచినీరు బురదగా వస్తోంది. పంచాయతీ సిబ్బందిని అడిగినా పట్టించుకోవడం లేదు. వాటర్ ట్యాంక్ క్లీన్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి.

- నాగసాయి, లోకమూడి, మండవల్లి మండలం

డీపీవో : నీటి పరీక్షలు నిర్వహించి సక్రమంగా మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

- మా గ్రామంలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉంది. ఈ సమస్య పరిష్కరించాలని గతంలో ధర్నా చేశాం. శ్మశాన వాటిక సమస్య ఉంది. ఈ సమస్యలను ఏ అధికారి పట్టించుకోవడం లేదు.

- సురేష్, పెయ్యేరు, ముదినేపల్లి మండలం

డీపీవో : ఈ సమస్యలను పరిష్కరిస్తాం. సంబంధిత అధికారులకు తక్షణం ఆదేశాలు ఇస్తాం.



డ్రెయినేజీలు, పారిశుధ్యం అధ్వానం

- మా ఇంటి దగ్గర ఉన్న కందకాన్ని పూడ్చి వేయడంతో వర్షపునీరు ఇంట్లోకి వచ్చి పిల్లలు వ్యాధుల బారిన పడ్డారు. మోకాలు లోతు నీరు నిలవడంతో దోమలు బెడద ఎక్కువగా ఉంది. సర్పంచ్, సచివాలయ సిబ్బందికి విన్నవించినా పరిష్కారం కాలేదు.

- టి. జయరాజు, చిత్తకూరు, చాట్రాయి మండలం

డీపీవో : పంచాయతీ కార్యదర్శి, ఈవోఆర్డీ ద్వారా ఈ సమస్య పరిష్కరిస్తాం.

- మేము రేకుల షెడ్డులో ఉంటున్నాం. అక్కడ డ్రెయినేజీ నీరు నిలవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సర్పంచ్‌కు ఈ సమస్య తెలిపాం. వీధి లైట్లు పని చేయడం లేదు.

- వెంకట అప్పారావు, శ్రీహరిపురం, ముదినేపల్లి మండలం

డీపీవో : డ్రెయినేజీ, వీధి లైట్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. బైపాస్ రోడ్డులో మంచినీటి చెరువు ఆక్రమణలకు గురైంది. వీధి దీపాల సమస్య ఉంది. మంచినీటి నాణ్యతగా సరఫరా చేయాలి.

- రహీమ్, కైకలూరు

డీపీవో : సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

నిధుల దుర్వినియోగం

- పెయ్యేరులో నిధులు దుర్వినియోగం అయ్యాయి. అర్జీ ఇచ్చినా ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకోలేదు.

- విజయ్, పెయ్యేరు, ముదినేపల్లి మండలం

డీపీవో : నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే విచారణ జరుగుతోంది. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం.

వైసీపీకి కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి రాజీనామా



ఏలూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడో డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పంపించారు. పార్టీలో తనకు గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తన సోదరి, రాష్ట్ర సాహిత్య అకాడమి మాజీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మిని ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త అవమానించారని, దీనిని హైకమాండ్ దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో వివరణ కోరకుండానే శ్రీలక్ష్మిని సస్పెండ్ చేయడం ఆవేదన కలిగించిందన్నారు. ఈ క్రమంలోనే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.



స్కూల్ బస్సుల తనిఖీ

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు విద్యా సంస్థలకు చెందిన బస్సులను మోటారు వాహన తనిఖీ అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు ఫిట్‌నెస్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్సు, వాహన బీమా తదితర రికార్డులను పరిశీలించారు. ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేసినట్టు డీటీసీ కరీమ్ తెలిపారు. వాహన తనిఖీల్లో అధికారులు ఎస్‌బీ శేఖర్, వై.సురేష్‌బాబు, వైఎస్‌వై కల్యాణి పాల్గొన్నారు.

> 'మీ భూములకు రాష్ట్రంలో ఎక్కడా రిజిస్ట్రేషన్ కావడం లేదా ? అయితే మొగల్తూరు వచ్చేయండి. మేం చేయిస్తాం' అంటూ కొంత కాలంగా కొందరు అక్రమ రిజిస్ట్రేషన్లకు తెగబడుతున్నారు. ఇందుకు నిదర్శనం.. కొన్నేళ్లుగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు ఇక్కడి కార్యాలయంలో జరగడమే ! అక్రమ రిజిస్ట్రేషన్‌లకు ఇక్కడి సబ్ రిజిస్ట్రార్లు సహకరించడంతో ఇప్పుడు భూములకు భద్రత కరువైంది.

భూం..ఫట్

- నిబంధనలకు విరుద్ధంగా భూముల రిజిస్ట్రేషన్లు
- అక్రమాలకు అడ్డా.. మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ఎటువంటి వివాదాస్పద భూమికైనా ఇక్కడ గ్రీన్‌సిగ్నల్
- నేతల అండదండలతో సీఆర్‌జడ్ భూములనూ వదల్లేదు
- ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ఇక్కడకు క్యూ
- ఇప్పటికి ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు సస్పెన్షన్.. అయినా మారని తీరు
- నిషేధిత, ప్రభుత్వ పోరంబోకు స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసేశారని లేఖర్ల సంఘం ఆరోపణ
- మూడు వేల రిజిస్ట్రేషన్లపై సీబీసీఐడీ విచారణ చేపట్టాలని డిమాండ్



(భీమవరం-ఆంధ్రజ్యోతి):

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. అక్కడ పనిచేసే అధికారులపై తరచూ వేటు పడుతోంది. తీర ప్రాంతంలో అసైన్డ్ భూములు అధికంగా ఉండడంతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఒకరి భూమిని మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ రిజిస్ట్రేషన్ జరగపోయినా సరే మొగల్తూరు వచ్చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లలో ఆన్‌లైన్ విధానం అమలు ఉండడంతో అంతా ఈ కార్యాలయంపైనే ఆధారపడుతున్నారు. ఇక్కడకు వస్తే రిజిస్ట్రేషన్‌లు సులువుగా అవుతాయని అంతా భావిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. ఇది నిజం కూడా.! ఈ అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. ఈ క్రమంలోనే ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు వరుసగా సస్పెండయ్యారు. గత ప్రభుత్వంలోనే మొగల్తూరులో వందలాది రిజిస్ట్రేషన్‌లు అక్రమంగా జరిగాయి. అందుకు తగ్గట్టుగానే విచారణలో నిజమని తేలింది. సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌లను సస్పెండ్ చేస్తూ వస్తున్నారు. అయినా అక్కడ అక్రమాలను అరికట్టలేకపోతున్నారు.

మూడు జిల్లాల రిజిస్ట్రేషన్లు ఇక్కడే

మొగల్తూరు మండలం తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు అనువుగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిపై పెద్దగా దృష్టి ఉండదు. దీంతో నిబంధనలు అడ్డొచ్చే రిజిస్ట్రేషన్‌లకు ఇది అడ్డాగా మారింది. వైసీపీ హయాంలో లెక్కలేనన్ని భూములను అడ్డంగా రిజిస్ట్రేషన్ చేశారు. నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్ చేసేశారు. మండలంలో ఈనామ్ భూములు, భూమి లేని నిరుపేదలకు ఇచ్చే స్థలాలు, పోరంబోకు, సీఆర్‌జడ్, గ్రామ కంఠంలో భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సబ్ రిజిస్ట్రార్‌లను ప్రసన్నం చేసుకుంటున్నారు. సొమ్ములు ముట్టచెప్పి రిజిస్ట్రేషన్‌లు నిర్వహిస్తున్నారు.

ఇటీవల కృష్ణా జిల్లాలోని ప్రైవేటు భూములు వేరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారంటూ మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అలజడి రేగింది. బాధితులు కార్యాలయం వద్ద ధర్నాలకు దిగారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేయడం ఇటీవల సర్వసాధారణమైంది. రిజిస్ట్రేషన్‌లకు అవకాశం లేని భూములు మండలంలో దాదాపు ఆరు వేల ఎకరాలు ఉంటాయి. సదరు భూములను నిబంధనలను పక్కనపెట్టి రిజిస్ట్రేషన్లు చేయడం పరిపాటిగా మారింది. సీఆర్‌జడ్ భూములు రిజిస్ట్రేషన్లు అయిపోతున్నాయి. గతంలో సబ్ రిజిస్ట్రార్ ఏకంగా 300 రిజిస్ట్రేషన్‌లను చేసేశారు. దీనిపై అధికారులు దర్యాప్తు జరిపి నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వంలోనే ఇవన్నీ జరిగిగాయి. అప్పటి అధికార పార్టీ నేతల ఒత్తిడితో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొనుగోలుదారులు ఇక్కడకే వస్తుంటారు. ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అందరి దృష్టి ఉండేది. మూడేళ్లుగా ఈ కార్యాలయంలో ఏ సమస్యలు లేవు. ఇప్పుడు ఆ జాబితాలో మొగల్తూరు కార్యాలయం చేరింది. ఇప్పటి దాకా మూడు వేల రిజిస్ట్రేషన్‌లు అక్రమంగా జరిగాయని అక్కడి లేఖరులే ఆరోపణలు చేశారంటే అవినీతి భాగోతం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్లపై సీబీసీఐడీతో విచారణ చేయాలి

మొగల్తూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లపై సీబీసీఐడీతో విచారణ చేయించాలని మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మొగల్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత భూములు, ప్రభుత్వ పోరంబోకు స్థలాలు, ప్రభుత్వ ఇంటి స్థలాలు, మార్ట్‌గేజ్‌లు సుమారు మూడు వేలు వరకు అక్రమ పద్ధతిలో మొగల్తూరు కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగి ఉండవచ్చని వాటిపై సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి సీబీసీఐడీతో విచారణ నిర్వహిస్తే జరిగిన అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలకు దళారీ పాత్ర పోషించిన కొంతమంది లేఖర్లపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేఖర్ల సంఘ కార్యదర్శి శీలబోయిన సత్యనారాయణ, సభ్యుడు కడలి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు వెళ్లాలంటే భయం

సబ్ రిజిస్ట్రార్‌లుగా మొగల్తూరు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. తాజాగా సస్పెండ్‌కు గురైన సబ్ రిజిస్ట్రార్ డిప్యూటేషన్‌పై ఆదాయపు పన్ను శాఖకు వెళ్లిపోయారు. కొత్తగా సబ్ రిజిస్ట్రార్‌లు ఎవరూ రావడం లేదు. సీనియర్ అసిస్టెంట్లతో కాలం వెళ్లదీస్తున్నారు. మొగల్తూరు వెళితే బలికాక తప్పదంటూ రిజిస్ట్రేషన్ శాఖలో ముద్రపడింది. అక్కడ సెటిల్‌మెంట్‌లు చేసే దందా ఎక్కువ. ఏదో ఒక రూపంలో అధికారులను బ్లాక్ మెయిల్ చేసి రిజి స్ట్రేషన్‌లు చేసుకునే పరిస్థితులు ఉన్నాయి. నేతల అండదండలు ఉన్నాయనే ఉద్దేశంతోనే అడ్డగోలుగా రిజిస్ట్రేషన్‌లు చేసి బలైపోతున్నారు. నాలుగేళ్ల వ్యవధి లో ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు సస్పెండ్ కావడం అక్కడ అవినీతి దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏపీ గౌడ కార్పొరేషన్‌లో ఒకరికి చోటు

ఏలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ గౌడ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఒకరికి పదవి దక్కింది. భీమవరానికి చెందిన పామర్తి వెంకట్రామయ్యకు డైరెక్టర్ పదవి పొందారు. ఈ మేరకు ప్రభుత్వ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు అందించారు.









'దక్ష' లో మోహన్‌బాబు

నాన్నకు ప్రేమతో..



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్

కడుపుబ్బా నవ్వించే చిత్రం



సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.





గేట్స్ ఫౌండేషన్ ఒప్పందాలతో రాష్ట్ర పురోగతి

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌కు జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

భీమవరం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న కీలక ఒప్పందాలు రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడతాయని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఢిల్లీలో బుధవారం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమా వేశంలో శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి కల్పన తదితర కీలక రంగాల్లో సేవలను మెరుగుపర్చడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగానికి ఉన్న అవకాశాలపై చర్చలు జరిగాయని వర్మ తెలిపారు.

విదేశీ దిగుమతులు తగ్గిస్తాం : ఎంపీ మహేశ్



ఏలూరు టూటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉత్పత్తుల దిగుమతులు తగ్గించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. లోక్‌సభలో ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, టెలికాం, పవర్ వంటి వేగంగా విస్తరిస్తున్న రంగాల అవసరాలు తీర్చడానికి కేంద్రం దిగుమతులపై ఆధార పడిందని మంత్రి సమాధానం ఇచ్చారు. దిగుమ తులు తగ్గించకోడానికి దేశీయ ఉత్పత్తులను పెంచేందుకు మేకిన్ ఇండియా కార్యక్రమంలో కేంద్రం అనేక చర్యలు చేపట్టిందన్నారు. చైనా ఉత్పత్తుల దిగుమతిని ఐదేళ్లలో తగ్గించేందుకు చర్యలు చేపడు తున్నామని మంత్రి సమాధానం ఇచ్చారు. సెమీ కండక్టర్స్, డిస్‌ప్లే తయారీ ఎకో సిస్టమ్ అభివృద్ధి రూ.76 వేల కోట్లతో సెమికాన్ ఇండియా ప్రోగ్రాం ఆమోదించిందని మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో 99.58 శాతం ప్రజలకు మొబైల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

రోడ్లు వేశాం.. రోడ్డు పాలయ్యాం

బిల్లులు చెల్లించాలని రోడ్లు ఊడ్చి నిరసన చేపట్టిన కాంట్రాక్టర్లు



ఏలూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్లు రోడ్డెక్కారు. రహదారుల నిర్మాణ కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినూత్న నిరసన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ఆర్‌అండ్‌బి కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి.సతీష్‌చౌదరి, సభ్యులు కేపీ.ప్రభాకర్, వైస్ చైర్మన్ పి.సోమేశ్వరరావు, కార్యదర్శి యూవీ.సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో వేలాది మంది కాంట్రాక్టర్లు 20పైగా ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఇటీవల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఎన్విరాన్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్‌లో పనులు చేపట్టామని తెలిపారు. వైసీపీ పాలనలో చేసిన పనులకు బిల్లులు రాక అనేక అవస్థలు పడ్డామని, చెల్లించాల్సిన బిల్లులు జాప్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామ న్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా కొత్తగా రోడ్లు వేశామని, బిల్లులు రాక రోడ్డున పడ్డామంటూ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించేందుకు సీఎఫ్‌ఎంఎస్ నిధి పోర్టల్‌లోని సాంకేతిక అడ్డంకులను పరిష్కరించాలని, ఆర్‌అండ్‌బీ శాఖలో పెండింగ్‌లో ఉన్న సుమారు 1350 కోట్లు చెల్లించాలని, పంచాయతీరాజ్ విభాగంలో పెండింగ్ బిల్లులు తక్షణం క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల మునిసిపల్ కాంట్రాక్టర్స్ బీఏఐ, ఏబీసీఏ అసోసియేషన్ నాయకులు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు .. 8 రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏలూరు మీదుగా నడిచే రెండు ప్రత్యేక రైళ్ళను పొడిగిస్తున్నట్టు దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. కాకినాడ టౌన్ లింగంపలి(07445) సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రయాణించే రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకూ లింగపల్లి నుంచి కాకినాడ టౌన్ (07446) మంగళ, గురు, శని వారాల్లో నడిచే రైలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి జులై 1వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు సెక్షన్ల పరిధిలో మార్చి 24వ తేదీన నాన్ ఇంటర్ లాకింగ్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఏలూరు మీదుగా నడిచే రైళ్ళను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు.

మార్చి 24వ తేదీన కాకినాడ పోర్టు - విశాఖపట్టణం, (17267) విశాఖపట్టణం - కాకినాడ పోర్టు (17268), రాజమండ్రి-విశాఖపట్టణం (67285) విశాఖపట్టణం- రాజమండ్రి (67286) విశాఖ పట్టణం-గుంటూరు (22875), గుంటూరు - విశాఖపట్టణం (22876) వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. గుంటూరు - విశాఖపట్టణం (17239) మార్చి 23, 24 తేదీల్లో , విశాఖపట్టణం - గుంటూరు (17240) మార్చి 24, 25 తేదీలలో రద్దు చేస్తున్నామన్నారు.

సీఎంవో స్టిక్కర్ పెట్టుకుని మోసగిస్తున్న ఒకరి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కారుకు సీఎంవో (చీఫ్ మినిస్టర్ ఆఫీస్) స్టిక్కర్ పెట్టుకుని పలువురిని బెదిరిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఏలూరు జిల్లా ఎస్పీ కె.పి.ఎస్.కిశోర్ తెలిపారు. ద్వారకాతిరుమల మండలం పి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఊరకరణం జగన్నాథరావు అలియాస్ జగన్ (43) ప్రస్తుతం కామవరపుకోటలోని మారుతీనగర్‌లో ఉంటున్నాడు. గతంలో జగన్ తపస్య గ్లోబల్ స్కూల్ అండ్ కాలేజీని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించి విద్యార్థులను చేర్చుకున్నాడు. తన స్కూల్లో చేర్చుకున్న విద్యార్థులను కామవరపుకోటలోని విశ్వతేజా స్కూల్లో చేర్చుకోవాలని యజమానిని కోరాడు. అతను నిరాకరించడంతో తాను సీఎంవోలోని ఏపీసీఆర్డీఏలో వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నాని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఐదు లక్షలు ఇవ్వకపోతే స్కూల్ అనుమతులు రద్దు చేయిస్తానంటూ హెచ్చరించాడు. దీంతో బాధితుడు తడికలపూడి పోలీసులకు ఈ నెల 18న ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు బెదిరింపులకు పాల్పడిన జగన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి అతని నుంచి కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడు తన కారుపై సీఎంవో అనే స్టిక్కర్ పెట్టి పోలీస్ సైరన్ కూడా అమర్చుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ నెల 17న తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని వీరవల్లిటోల్ ప్లాజా సిబ్బందితో తాను సీఎంవోలో ఉన్నాని గొడవ చేస్తుండగా ఓ రిపోర్టర్ వీడియో తీస్తుండగా అతడిని బెదిరించినట్టు తెలిపారు. 2020లో జంగారెడ్డిగూడెంలో లెక్చరర్‌గా పనిచేస్తూ యాజమాన్యానికి తెలియకుండా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి మోసం చేశాడన్నారు. జంగారెడ్డిగూడెంలోని వికాస్ కాలేజీలో పార్టనర్‌లను, భవన యజమానులను బెదిరించి మోసం చేశాడన్నారు. 2023లో ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండు బాక్స్‌లతో రోడ్డు బ్లాక్ చేసి పోలీసులపై పెట్రోలు పోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ నేపథ్యంలో నిందితుడైన కరణం జగన్నాధరావు అలియాస్ జగన్‌ను అరెస్టు చేసి చింతలపూడి కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించారని ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా పోలీస్ సైరన్ కాని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్టిక్కర్లు, ప్రభుత్వ అధికారులమని వాహనాలపై స్టిక్కర్లు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి వారు ఉంటే 112 కాని, 95503 51100కు లేదా 83329 59175కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పిచ్చుకా .. క్షేమమా ?



కనిపించని పిచ్చుకలు
సెల్ టవర్ల రేడియేషన్‌తో కనుమరుగు
పక్షుల సంరక్షణకు చర్యలేవి
నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఇంటి చూరులో ఆవాసం ఏర్పరచుకుని ఆహ్లాదాన్ని పంచే పిచ్చుకలు కనుమరుగైపోతున్నాయి. పంట చేలల్లో, ఇంటి ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. కిచకిచమని అరుస్తూ ఇంట్లోకి ప్రవేశించి మనల్ని పలకరించే పిచ్చుకలు నేడు కనుమరుగవుతున్నాయి. ఊరి మధ్యలో ఉన్న మర్రిచెట్టు, రావి చెట్లపై గూళ్ళు కట్టుకొని సాయంత్రం అయ్యేసరికి చేరుకుని సందడి చేసేవి. ఆధునిక జీవన పోకడలతో పిచ్చుకలు అంతరించిపోతున్నాయి. పిచ్చుకలను సంరక్షించాలన్న లక్ష్యంతో ఏటా మార్చి 20 తేదీన ప్రపంచ పిచుకల దినోత్సవం జరుపుకుంటున్నారు. అంతరించి పోతున్న సహజ జీవ వైవిధ్యం, జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి వాటిని కాపాడుకునేందుకు ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.

నిడమర్రు మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఏ ఊరికి వెళ్లినా పలకరించేవి పిచ్చుకలే. కిచకిచ మంటూ మన చుట్టూ తిరుగుతూ ఎంతో ఆహ్లాదకరంగా ఉండేవి. ధాన్యం గింజలో, బియ్యం నూకలో వేస్తే ఎక్కడో చెట్టు కొమ్మలో కూర్చున్నవి కూడా చటుక్కున వచ్చి వాలేవి. కానీ నేడు పట్టణాల లోనే కాదు పల్లెల్లో కూడా పిచ్చుకల కిచకిచలు వినబడడం లేదు. ఇళ్ల మధ్యలో సెల్‌టవర్లు ఏర్పాటు చేయడంతో రేడియేషన్ ప్రభావం ఎక్కువగా ఉండి పిచ్చుకల గుండె, నాడీ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం కల్గి చనిపోతున్నాయి. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో కూడిన పళ్లు, ఆహారధాన్యాలను తినడంతో పిచ్చుకలు అంతరించి పోవడానికి ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేడియేషన్ ప్రభావం ఎక్కువ

ఇతర ప్రాంతాల్లో నివసించే పక్షలతో పోలిస్తే సెల్ టవర్ దగ్గర నివసించే పక్షుల జీవితకాలం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. సెల్ టవర్ దగ్గర రేడియో ఫ్రీక్వెన్సీ బ్యాలెన్సింగ్ సరిగా లేకపోవడం , 30 డెసిబుల్ తరంగాల వల్ల కలిగే ఒత్తిడికి పిచ్చుకల రోగనిరోధక వ్యవస్థ బలహీనపరు స్తుంది. తద్వారా వ్యాధులు తొందరగా సంక్రమించి చనిపోతు న్నాయి. సెల్ కంపెనీలు హైఫ్రీక్వెన్సీ రేడియేషన్ ఉపయోగించడం వల్ల పక్షులకు హాని కలుగుతోంది. ఇటీవల సెల్ కంపెనీలు 5జి నెట్‌వర్క్ కోసం 24 -60 జిహెచ్ బ్యాండ్ ఫ్రీక్వెన్సీ రేడి యేషన్‌ని కూడా వాడుతున్నారు. దీంతో పిచ్చుకలతో పాటు రామ చిలుకలు, రాబందులు, పావురాలపై కూడా ఈ రేడియేషన్ ప్రభావం కలుగుతోందని పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నారు.

• టెక్నాలజీతో పక్షిజాతుల మనుగడకు ఇబ్బంది



నేటి ఆధునిక జీవన పోకడల వల్ల పక్షిజాతులపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది. సెల్ కంపెనీలు ఉపయోగించే హైఫ్రీక్వెన్సీ రేడియేషన్ ప్రభావం వల్ల పిచ్చుకల రోగనిరోధక వ్యవస్థ, హృదయ స్పందన రేటు దెబ్బతిని చనిపోతున్నాయి. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేక విధివిధానాలు రూపొందించి పక్షిజాతి స్నేహ పూర్వక టెక్నాలజీ విధానాలను అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. చెట్లు పెంపకం, పరిసరాల పచ్చదనం కార్యక్రమాల పట్ల శ్రద్ధ వహించాలి.

డాక్టర్ గుడాల సత్యప్రతాప్ అసోసియేట్ ప్రొఫెసర్,గణపవరం

• పక్షుల పట్ల అవగాహన పెంచుకోవాలి



మా ఇంటి డాబాపై నిత్యం బియ్యం కానీ, ధాన్యం గింజలు చల్లుతుంటాను. గింజలు చల్లిన కాసేపటికి వివిధ పక్షులు, రామ చిలుకలు, పావురాలు, పిచ్చుకలు వచ్చి ఆ గింజలు తింటాయి. రోజూ సుమారు 700 నుంచి 1500 వరకు పక్షులు వచ్చి ఆహారం తీసుకొని ఎగిరి పోతాయి. పర్యావరణం, పక్షుల రక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలి.

పెరుమాళ్ల దినకర ఆకర్ష్, పక్షుల ప్రేమికుడు, గణపవరం

పక్షుల అభివృద్ధికి కృత్రిమ గూళ్లు



జంగారెడ్డిగూడెం (ఆంధ్ర జ్యోతి) జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ వీరా మహేష్ తన ఇంటి వద్ద పిచ్చుకల కోసం 2009లో ఒక అట్టపెట్టెను తయారు చేసి పెట్టారు. పిచ్చుకలు ఆ అట్టపెట్టెలోకి వచ్చేవి. అక్కడే తమ జాతిని అభివృద్ధి చేసుకోవడం చూసిన ఆయన 2012 నుంచి పిచ్చుకల సంరక్షుడిగా మారారు. ఇప్పటి వరకు చెక్కతో 750 వరకు పిచ్చు కల ఆవాసాలను (గూడు) తయారుచేసి పక్షుల ప్రేమికులకు ఉచితంగా అందజేస్తున్నారు. గణపవరం మండలం ముప్పర్తి పాడు గ్రామస్తుల కోరిక మేరకు 2017లో ఆరు జతల పిచ్చుకలను ఆ గ్రామంలో వాటికి 20 ఆవాసాలు (గూళ్ళు) ఏర్పాటు చేసి విడిచిపెట్టారు. ఇప్పుడు రెండు వందలకు పైగా అభివృద్ధి చెందాయి. పిచ్చుకలపై ఆయనకున్న ప్రేమతో కృత్రిమ ఆవాసాల ద్వారా పిచ్చుకల జనాభా పునరుద్ధరణపై రీసెర్చ్ చేసి థీసెస్‌ను మచిలీపట్నం కృష్ణా యూనివర్శిటీకి సబ్‌మిట్ చేయగా యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

పిచ్చుకలను సంరక్షించుకోవాలి



ప్రకృతిలో భాగమైన పిచ్చుకల సంఖ్య తగ్గిపోకుండా వాటిని కాపాడాలి. సెల్ ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల వాటికి పెద్దగా ప్రమాదం లేదని నా రీసెర్చ్‌లో తెలిసింది. ఫిబ్రవరి నుంచి సెప్టెంబరు మధ్యలో పిచ్చుకలు వాటి సంతానోత్పత్తిని పెంచు కుంటాయి. ఆ సమయాల్లో మూడు నుంచి ఐదు గుడ్లు పెట్టి పొదుగుతాయి. పక్షి ప్రేమికులు తమ ఇళ్ళ వద్ద వాటికి కృత్రిమ గూళ్ళు అందుబాటులో ఉంచితే అవి సంతానోత్పత్తి చేస్తాయి.

- డాక్టర్ వీరా మహేష్, జువాలజీ అధ్యాపకుడు, పిచ్చుకల సంరక్షకుడు, జంగారెడ్డిగూడెం

చిన వెంకన్న ఆలయంలో కిలకిలారావాలు





ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి): పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలు నిండిన పళ్లు, ఆహార ఉత్పత్తులు, సెల్ టవర్ల నుంచి వెలుబడే అయస్కాంత తరంగాలు ఈ జాతికి ముప్పుగా పరిణమించాయి. పిచ్చుకలను సంరక్షించేందుకు ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆలయ ఆవరణలోని పందిళ్లకు, బొగడ చెట్ల కొమ్మలకు ధాన్యం కంకులను ఏర్పాటు చేసి, వాటికి ఆహారం అందిస్తున్నారు. తాగేందుకు మంచినీటిని సైతం ఏర్పాటు చేస్తున్నారు. పక్షి జాతుల పట్ల ఆలయ అధికారులు చూపుతున్న ప్రేమను పలువురు భక్తులు అభినందిస్తున్నారు.

పక్షులతో ప్రశాంతత



ఒకప్పుడు ఆలయగోపురాల్లో పిచ్చుకలు, పావురాలు ఎక్కువగా ఉండేవి. అయితే పల్లెలు, పట్టణాల్లో వస్తున్న మార్పులు, బహుళ అంతస్తు కట్టడాలు, వాయు, శబ్ద కాలుష్యం, రేడియేషన్ తట్టుకుని నిలబడే శక్తి లేక ఇవి అంతరిస్తున్నాయి. పల్లెల్లోనూ పిచ్చుకలు కన్పించడం లేదు. వీటికి కనీసం సరైన ఆహారం అందిస్తే కొంత కాలం మన కళ్లముందుంటాయన్న ఆశతో నిత్యం ఆలయంలో వాటికి ధాన్యం,మంచినీటిని అందుబాటులో ఉంచుతున్నాం. పచ్చని మొక్కలు.. వాటిపై వాలే పక్షుల కిలకిలారావాలు ఆలయ పరిసరాలకు ప్రశాంతతను చేకూరుస్తాయి.

-ఎన్వీ సత్యనారాయణమూర్తి, దేవస్థానం ఈవో

నోటి ఆరోగ్యం ..జాగ్రత్త

వదిలేస్తే దీర్ఘకాలిక రోగాలకు అవకాశం
నేడు ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం



లింగపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అంటారు. ప్రస్తుత కాలాన్ని బట్టి నోరు మంచి దైతే మన ఆరోగ్యం కూడా మంచిదవుతుందని చెప్పవచ్చు. నోరు శుభ్రంగా లేకుంటే బ్యాక్టీరియా నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి దంతాలు పుచ్చిపోవడం, నోటిక్యాన్సర్ లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. చిన్న పిల్లలు ఏదైనా తిన్న తరువాత శుభ్రంగా ఉంచుకునేలా తల్లిదండ్రులు అర్థమయ్యేలా చెప్పాలి. నోరు శుభ్రంగా లేకుంటే దంత సంబంధిత వ్యాధులతో పాటు మతిమరుపు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని పలువురు దంతవైద్యులు చెపుతున్నారు. నోటిశుభ్రతపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్చి 20వ తేదీని ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించింది.

ఎక్కువ శాతం వైరస్‌లు, బ్యాక్టీరియాలు నోటినుంచే శరీరంలోకి ప్రవేశిస్తాయి. నోరు, దంతాలను శుభ్రంగా కడగక పోవడం, ధూమపానం, మద్యపానం సేవించడం వల్ల నోటి దుర్వాసన, నోటిలో దంతక్షయం, నోటిలోపల పుండ్లు వచ్చేందుకు అవకాశం ఉంది. తరచూవచ్చే నోటి సమస్యలను పరిష్కరించు కునేందుకు ఉదయం, సాయంత్రం నోటిని ఐదు నిమిషాల పాటు శుభ్రప రచుకోవాలి. ధూమపానం, పొగాకు సంబంధిత ఉత్పత్తులు, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండటం వల్ల కొంతమేర నోటి సమస్యలను అరికట్టవచ్చు.

దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం



నోటి ఇన్‌ఫెక్షన్ల వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమిస్తాయి. నోటిలో ఉన్న బ్యాక్టీరియా శ్వాసకోశాల ద్వారా, లాలాజలం ద్వారా ఊపిరితిత్తులలోకి, జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించి న్యుమోనియా, దంతక్షయం, చిగుళ్లవ్యాధి, నోటిక్యాన్సర్, జీర్ణసమస్యలతో పాటు గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయి. చిన్నపిల్లలు, పెద్దవారిలో ముఖ్యంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిలో నోటి ఇన్ఫెక్షన్‌ల వల్ల వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం దంతాలు, నోటి సంబంధిత వ్యాధులకు అధునాతన వైద్యం అందుబాటులో ఉంది. నోటి సమస్యలు వస్తే తప్పకుండా దంతవైద్యులను సంప్రదించాలి.

డాక్టర్ పసుపులేటి దినేశ్, డెంటల్ సర్జన్, ప్రభుత్వ ఆసుపత్రి, నూజివీడు

బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ కారణం



దంతాలు పాడవటం, ఆరోగ్య సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. నోటి సంబంధిత వ్యాధులకు బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ప్రధాన కారణం, రోగ నిరోధక వ్యవస్థ తగ్గినప్పుడు శరీర ఇన్ఫెక్షన్‌లు, నోటిలో బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. నోటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెజబ్బులు, మధుమేహం, గొంతు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లు వచ్చే అవకాశాలు ఎక్కు వగా ఉంటాయి. నోటి ఇన్ఫెక్షన్‌లు రాకుండా ఉండాలంటే ఉదయం తినకముందు రాత్రి తిన్న తరువాత రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా దంతాలతో పాటు నోటిని కూడా శుభ్రపరుచుకోవాలి.

డాక్టర్ రామ్ విజయానంద్, దంత వైద్యనిపుణుడు, ధర్మాజీగూడెం, లింగపాలెం మండలం



ఫోన్ పోగొట్టుకున్న మహిళకు ఫోన్ అందిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

రూ. 23 లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ

భీమవరం క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) చోరీకి గురైన, పోగొట్టుకున్న సుమారు రూ. 23 లక్షల విలువ గల 155 సెల్‌ఫోన్లను తిరిగి బాధితులకు అందజేశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బాధితులకు అందించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ. 2 కోట్ల 9 లక్షల 10 వేలు విలువ చేసే 1,394 సెల్‌ఫోన్లు బాధితులకు అందించామన్నారు. మొబైల్ పోగొట్టుకుంటే 91549 66503 నంబర్‌కు హాయ్ అని గాని, హెల్ప్ అని గాని మెస్సేజ్ చేస్తే వచ్చిన లింక్ ద్వారా సంబంధించిన వివరాలు పంపిస్తే మొబైల్ రికవరీ చేస్తామన్నారు. లింక్‌లో వివరాలు నింపడం ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా సంబంధించిన అధికారులు వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. బిల్లులు లేని సెల్ ఫోన్లను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని తెలిపారు. 155 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో కృషిచేసిన మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అహ్మదున్నీసా, ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది రత్నంరెడ్డి, కుమార్, శ్రీనివాస్, లక్ష్మీకుమారి, పాపారావు, ప్రసాద్‌బాబు, భాస్కర్, సునీల్‌కుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

క్రైమ్ కార్నర్

భారీ దోపిడీకి స్కెచ్ వేసిన బ్యాంక్ ఉద్యోగి

నిందితుడిని పట్టుకున్న పోలీసులు
2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం

కాకినాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర వ్యసనాల కారణంగా పనిచేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి సస్పెండ్ అయ్యాడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్నచిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బిహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అనుమానం వచ్చి నిందితుడిని పట్టుకున్నారు. 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ వివరాలను వెల్లడించారు. విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బంగారాన్ని సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడీ చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వహించాడు. పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదే శాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో ఒక్కో కేసు ఉన్నట్టు తెలిపారు.



వివరాలు చెబుతున్న కాకినాడ ఎస్పీ.. స్వాధీనం చేసుకున్న పిస్టల్స్

కళ్లల్లో కారం కొట్టి దారిదోపిడీ

ముగ్గురి అరెస్టు.. లక్షా 90 వేల రూపాయల నగదు స్వాధీనం



వివరాలు చెప్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక యువకుడి కళ్ళల్లో కారం కొట్టి దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి లక్షా 90 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. హిందుస్థాన్ ఆదిత్య అసోసియేట్స్ కంపెనీ కలెక్షన్ ఏజెంట్లు ఏలూరు నగరంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన షాపుల నుంచి కలెక్షన్ చేసుకుని రాత్రి 11.30 గంటల సమయంలో ఏలూరులోని వన్‌టౌన్‌లోని అగ్రహారం కాంగ్రెస్ ఆఫీసు రోడ్డులో వెళ్తుండగా స్పీడు బ్రేకర్ వద్ద మోటారు సైకిల్ వేగం తగ్గించడంతో అక్కడ మాటు వేసి ఉన్న ముగ్గురు ఆగంతకులు ఏజెంట్ల కళ్ళల్లో కారం కొట్టి వారి వద్ద ఉన్న రెండు లక్షల 40 వేల 600 రూపాయల నగదు బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. బాధితులు ఏలూరు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సీసీఎస్ సీఐ రాజశేఖర్, వన్‌టౌన్ ఎస్‌ఐలు షేక్ మదీ నా బాషా, నాగబాబు, సీసీఎస్ ఏఎస్‌ఐ రాజకుమార్, అహ్మద్, కానిస్టేబుళ్ళు మోహన కృష్ణ, నాగార్జున, శేషకుమార్, యశ్వంత్ కుమార్, సురేష్‌కుమార్, రూహుళ్ళ బృందం నిఘా పెట్టారు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఏలూరు గూడ్స్‌షెడ్ రోడ్డులో రాజా లాడ్జి సమీపంలో ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై వస్తుండగా వారి కదలికలు అనుమానంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరానికి పాల్పడినట్లుగా అంగీకరించారు. వారి వద్ద నుంచి లక్ష 90 వేల రూపాయల నగదు, నేరానికి వినియోగించిన హీరో స్ప్లెండర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు దక్షిణపువీధి పెద్ద దేవుని గుడి సమీపానికి చెందిన గుమ్మల మణికంఠ శ్రీని వాస్ (24), ఉంగుటూరు మండలం చేబ్రోలు పిట్టావారి వీధికి చెందిన కల్లపల్లి దుర్గానాగవెంకట కొండలరావు అలియాస్ పాండు, గాంధీబొమ్మ సెంటర్ దక్షిణపు వీధికి చెందిన కల్లపల్లి చందు అలియాస్ అచ్యుత్‌లను అరెస్టు చేశారు. వీరిని ఏలూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ప్రత్యేక బృందాన్ని ఎస్పీ అభినందించారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కామవరపుకోట, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 21న ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఎం.సరళకుమారి తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రవేశపెట్టిన అంశాలపై చర్చలు జరుపుతామని, మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు అమలు చేస్తారని తెలియజేశారు.

ఆర్థిక గణనకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు

ఏలూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఐదేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా చేపట్టే 8వ ఆర్థిక గణన నిర్వహణకు కలెక్టర్ వెట్రిసెల్వి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. వచ్చే నెల నుంచి జరిగే ఈ గణనకు చైర్‌పర్సన్‌గా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా జిల్లా ప్రణాళికాధికారి (సీపీవో) ఉంటారు. సభ్యులుగా ఎస్పీ, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం, డీఐపీఆర్‌వో, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, డీపీవో, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎన్ఎస్ఎస్‌వో ప్రతినిధి, జిల్లా స్థాయి ఐటీ నిపుణులు ఉంటారు.

కొనుగోలు కేంద్రాలతో అపరాల రైతులకు లబ్ధి

పెదపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : అపరాలు సాగు చేసిన రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో అపరాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పెదపాడు నీటి సంఘం(డీసీ) అధ్యక్షులు బొప్పూడి కాశీబాబు తెలిపారు. పెదపాడు సొసైటీ ఆవరణలో అపరాల కొనుగోలు కేంద్రాన్ని పెదపాడు క్లస్టర్ ఇంఛార్జి గుత్తా అనిల్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు.డీసీ అధ్యక్షులు కాశీబాబు మాట్లాడుతూ 12 తేమ శాతం ఉంటే పెసలు క్వింటాలుకు రూ.8682, మినుములు క్వింటాలుకు రూ.7400 మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో డీవీ సుబ్బారావు, ఏవో ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

25, 28న విజ్ఞాన, విహార యాత్రకు సన్నాహాలు

ఏలూరు అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని బాల బాలికలను విజ్ఞాన, విహారయాత్రలకు ఈ నెల 25, 28 తేదీల్లో తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ యాత్రలు ఈ నెల 5వ తేదీనే ముగియాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఇంత వరకు సమగ్ర శిక్ష నుంచి డీఈవో ఖాతాకు జమకాకపోవడంతో జాప్యం కొనసాగుతోంది. తాజాగా ప్రతిపాదించిన తేదీల్లోగా నిధులు జమచేస్తే 25న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను కె.ఆర్.పురంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ కేంద్రానికి తీసుకెళ్తారు. హైస్కూళ్లలో 7, 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను ఏలూరులో 28న రాత్రి బయల్దేరి విశాఖ తీసుకెళ్లి మరుసటి రోజురాత్రి తిరుగు ప్రయాణమయ్యేలా షెడ్యూలును రూపొందించారు.కాగా నిధుల జమపైనే ఈ యాత్రలు ఆధారపడి ఉన్నాయని డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

టెన్త్ పరీక్షలకు 531 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన హిందీ పరీక్షకు జిల్లాలో మొత్తం 22,739 మందికి 22,277 మంది హాజరయ్యారని, 531 మంది గైర్హాజరైనట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ప్రైవేటుగా 100 మంది దరఖాస్తు చేసుకోగా 31మంది హాజరయ్యారని తెలిపారు. కాగా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(అపోస్) దూరవిద్య పదో తరగతి ఆంగ్ల పరీక్షకు 411మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 353మంది హాజరయ్యారని తెలిపారు. మొత్తం 85కేంద్రాలను తనిఖీబృందాలు సందర్శించాయని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదుకాలేదని వివరించారు.

కుమ్మరరేవు తాగునీటి సమస్య పరిష్కరించండి

ఏలూరు టూటౌన్, మార్చి19(ఆంధ్రజ్యోతి):కుమ్మరరేవు ప్రాంత వాసుల తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ నాయకురాలు కె.బేబీ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కుమ్మరరేవు వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీ మాట్లాడుతూ కుమ్మరరేవు ప్రాంతంలో వెయ్యి కుటుంబాలకు తాగునీరందిస్తామన్న హామీని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ భాను ప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.వరప్రసాద్, ఎం.విజయ, లక్ష్మీఇందిరా, సుధారాణి, యు.లక్ష్మీ, భవాని, అభిలాష్, స్వాతి పాల్గొన్నారు.

నేడు కోకో రైతుల రాష్ట్ర సదస్సు

టి.నర్సాపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : కోకో రైతులంతా సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో టి.నర్సాపురంలోని ప్రజాసంఘాల కార్యాలయాల్లో రైతు సంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళి అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ గురువారం పెదవేగి మండలం విజయరాయిలో జరుగుతున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సుకు రైతులంతా తరలిచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు, పాయం చినలక్ష్ముడు, వరగడ అగ్గిరాముడు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పనులు కేటాయించాలి

భీమడోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని, రూ.600 రూపాయల కూలీ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పోలసానపల్లిలోని ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచి అదనంగా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో సీపీఎం ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

'రోడ్ల అధ్వాన స్థితికి అధికారులే కారణం'

జంగారెడ్డిగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : రోడ్లు అధ్వానంగా ఉండటానికి ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని చింతలపూడి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటనలో రోడ్ల పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి నాటికి రోడ్లు బాగుపడతాయని ముఖ్యమంత్రి ప్రకటించినా ఆర్అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నియోజకవర్గంలో రోడ్లను నిర్మించకపోతే ప్రజల పక్షాన ఆందోళన చేయడానికైనా వెనుకాడబోమని ఈశ్వరయ్య హెచ్చరించారు.

గిరిజనులకు ఉచిత కంటి ఆపరేషన్లు

పోలవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి) : ఏజన్సీ గ్రామాలకు చెందిన 32 మంది గిరిజనులకు బుధవారం పోలవరం రాజమహేంద్రవరం గౌతమీ నేత్రాలయ ఆసుపత్రిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఐటీడీఏ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ మాట్లాడుతూ బుధవారం రెండో దఫా మరో 32 మందికి ఆపరేషన్లు నిర్వహించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రానున్న రెండు రోజుల్లో రెండు వందల మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

భూముల కొనుగోళ్లలో మోసం.. డీజీపీకి ఫిర్యాదు

లింగపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : భూముల కొనుగోలు విషయమై తనను వైసీపీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి మోసం చేశాడంటూ లింగపాలెం మండలంలో అదే పార్టీకి చెందిన ఒక సర్పంచ్ రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది. ఒంగోలులో 22(ఏ)కి సంబంధించిన విలువైన భూములను ఇప్పిస్తానంటూ తన దగ్గర కోటి రూపాయలకు పైగా తీసుకుని మోసం చేశాడని, ఒకసారి 50 లక్షలు, మరోసారి 60 లక్షలు కాజేసి భూములు అప్పగించకపోగా డబ్బులడిగితే బెదిరిస్తున్నాడంటూ ఆ సర్పంచ్ డీజీపీ వద్ద ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.. మండలంలో ఒకే పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతల మధ్య జరుగుతున్న వివాదంపై ఆ పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. దీంతో ఈ విషయం పోలీసుల వరకు వెళ్లిందని, తదనంతరం ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని మండలంలో ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు : సివిల్ సప్లై డీఎం శ్రీలక్ష్మి

బుట్టాయగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడుతున్నట్టు సివిల్ సప్లై డీఎం శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలో పర్యటించిన ఆమె బుట్టాయగూడెంలోని రైస్ మిల్లును పరిశీలించారు. కొంతకాలంగా మూతపడిన రైస్ మిల్లులను తిరిగి ప్రారంభించేందుకు యజమాని దరఖాస్తు చేసుకోగా బుధవారం ఆ మిల్లును పరిశీలించారు. జిల్లాలోని 21 మండలాల్లోని 139 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని సిద్ధం చేశామని, ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 15రోజులకు రైతులకు డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ప్రతాపరెడ్డి, ఎస్‌బీసీ దేవకీదేవి, సీఎస్ఆర్ఐ పద్మ పాల్గొన్నారు.

రబీలోనూ ధాన్యం సేకరించాలి : జేసీ ధాత్రిరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ

ఏలూరు,మార్చి 19(ఆంధ్రజ్యోతి) : గత వ్యవసాయ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో డీసీఎంఎస్ ఉత్తమ పనితీరు కనబర్చిందని, అదే విధంగా రానున్న రబీలో అదే స్ఫూర్తిని కొనసాగించాలని జేసీ పి.ధాత్రిరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో ఏలూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ మహాజన సభ బుధవారం జరిగింది. డీసీవో అరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ఈ ఏడాదిని ఐరాస ప్రకటించిందని, ఈ నేపథ్యంలో ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డీసీసీబీ సీఈవో సింహాచలం, రిజిస్ట్రార్లు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంపద సృష్టికి అడుగులు..

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన
కార్యదర్శులకు అధికారుల దిశానిర్దేశం
గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం



సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న దృశ్యం

లింగపాలెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో చెత్తనుంచి సంపద సృష్టిం చేందుకు ఇప్పుడిప్పుడే అడుగులు ముందుకు పడుతున్నాయి. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి ప్రాధాన్యతనిచ్చింది. ఈ మేరకు గ్రామ పంచా యతీల్లో సంపద తయారీ కేంద్రాలను సైతం నిర్మించారు. హరిత రాయబారులను నియమించి వారి ద్వారా తడి, పొడి చెత్తను సేకరించడంపై అవగాహన కల్పించారు. వీటి ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి పంచాయతీలకు కొంతమేర ఆదాయం చేకూర్చేలా కార్యాచరణ రూపొందించారు.. తదనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలను పక్కన పెట్టేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు కార్యాచరణ సిద్ధం చేయడంతో మళ్లీ ఆ కేంద్రాలకు జీవం వచ్చింది. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. లింగపాలెం మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా 20 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలున్నాయి. మిగిలిన రెండు పంచాయతీల్లో చెత్త నిర్మాణ దశలో ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో సంపద సృష్టించేందుకు పశువుల పేడ సేకరించి వానపాములు వదలడం ద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్నా కొన్నిచోట్ల మాత్రం క్షేత్ర స్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.

సేంద్రియ ఎరువులపై అవగాహన



కొత్తపల్లిలో క్లాప్ మిత్రుల ద్వారా చెత్తను సేకరించి దాని నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి చెత్త కేంద్రాల్లో పశువు పేడతో కలిపి సేంద్రియ పద్దతిలో వానపాములతో ఎరువు తయారు చేస్తున్నాం. ఈ ఎరువులపై అవగాహన కల్పించి రైతులకు తక్కువ ధరకు అందిస్తున్నాం. దాని ద్వారా పంచాయతీకి కొంతమేర ఆదాయం సమకూరుతోంది.

ఆర్.పాపయ్య, కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి

ఎప్పటికప్పుడు కేంద్రాల పరిశీలన



మండల వ్యాప్తంగా చెత్త నుంచి సంపద సృష్టించే విధానంపై అవగాహన కల్పించాం. సేంద్రియ ఎరువును తయారు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజూ చెత్తకేంద్రాలను పరిశీలించేలా పంచాయతీ కార్యదర్శికి బాధ్యతలు అప్పగించాం. సేంద్రియ ఎరువులపై స్పందన వస్తుండటంతో ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటున్నాం.

జె.ఎం.రత్నకుమార్, మండల విస్తరణాధికారి

అనధికార స్టిక్కర్లు వినియోగిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం, మార్చి19(ఆంధ్రజ్యోతి) : ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఎవరైనా వాహనాలకు పోలీస్ సైరన్, అధికారిక స్టిక్కర్లు వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ చెప్పారు. బుధవారం సాయంత్రం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంతమంది అనధికారికంగా పోలీసు, అంబులెన్సులు వినియోగించే సైరన్లను తమ వాహనాలకు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఇతర అధికారుల పేరుతో స్టిక్కర్లను పెట్టుకుంటే 112కు కాని 95503 51100కు సమాచారం అందించాలని సూచించారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు..

అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. బుధవారం జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ రవిచంద్ర సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రజలను బెదిరించినట్టు పోలీసులకు సమాచారమిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో సిఐ.కృష్ణబాబు, తడికలపూడి ఎస్.ఐ. చెన్నారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ఆదివారపుపేటలోని షిర్డీ సాయి ప్రేమ మందిర్ ఆరవ వార్షికోత్సవాలు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు తెలిపారు. ఈ మహోత్సవాల్లో బాబాకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు, గ్రామోత్సవాలు, కోలాట బృంద ప్రదర్శనలు, గురువుల సత్సంగాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం భక్తులకు మహా అన్నసమారాధనను ఏర్పాటు చేశామని తెలియచేశారు. ఈ మహోత్సవాల్లో బాబాకు రోజుకో అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గిరిజన భూములకు హక్కులు కల్పించాలి

బుట్టాయగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కులు కల్పించాలని, ఆదివాసీ గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ బుధవారం కెఆర్ పురం ఐటీడీఏ వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం, ఏపీ రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు కుంజం రామారావు అధ్యక్షత వహించగా రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఝాన్సీ పాల్గొని మాట్లాడారు.గిరిజనులు లక్షలాది ఎకరాల భూములను కోల్పోయి కూలీలుగా దుర్భర జీవితాలను గడుపుతున్నట్టు తెలిపారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, చింతపండు, జీడిమామిడి పంటను జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ భాషా, యు.వీరబాబు, వేట్ల విజయ, ఎస్.మోహన్, సవలం రాంబాబు, మిడియం పోసిరావు, ఎం.రవిదొర, దాడి రాముడు గిరిజనులు పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన అవసరం

చింతలపూడి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన ఉండాలని భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు జి.జీవనమౌనిక అన్నారు.చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక వ్యోమగామి సునీత విలియమ్స్ తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో ఉండి భూమికి రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి విజ్ఞానంపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ప్రపంచం ఆత్మీయ స్వాగతం : అంబికా కృష్ణ

ఏలూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : అనుకోని పరిస్థితుల్లో సుదీర్ఘకాలం అంతరిక్షంలో ఉండి భారత సంతతి వ్యోమ గామి సునీత విలియమ్స్ సురక్షితంగా భూమికి చేరుకోవడం పట్ల బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ హర్షం ప్రకటించారు. స్పేస్ ఎక్స్ ట్రూ డ్రాగన్ వ్యోమ నౌకలో భూమికి తిరిగొచ్చిన ఆమెకు ప్రపంచం ఆత్మీయ స్వాగతం పలుకుతుందన్నారు.

సునీత విలియమ్స్ దేశానికి గర్వకారణం..

సునీత విలియమ్స్ భూమిని చేరడం ఆనందంగా ఉందని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హర్షం ప్రకటించారు.అంకిత భావం, ధైర్యం, పోరాట పటిమ, స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సునీత విలియమ్స్ విజయాలు దేశానికే కాకుండా ప్రపంచానికే గర్వకారణమన్నారు. సంకల్ప శక్తి, అంకిత భావాన్ని చూసి ప్రపంచమే గర్విస్తుందన్నారు.

ఇంటి స్థలాల రెగ్యులైజేషన్‌పై చర్చ

జంగారెడ్డిగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయంలో ఇంటి స్థలాల రెగ్యులైజేషన్‌పై కౌన్సిలర్లకు, వీఆర్వోలకు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు తహసీల్దారు కె.స్లీవజోజి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15 కంటే ముందు పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న మహిళలకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 150గజాల వరకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు. అటువంటి వారి కుటుంబ సభ్యులెవ్వరూ ఆదాయ పన్ను చెల్లించని వారై ఉండాలని, పట్టణాల్లో నెలకు రూ.14 వేలు ఆదాయం ఉండాలని సూచించారు.

గుండుగొలనులో సంపద తయారీ కేంద్రాల పరిశీలన



గుండుగొలను, ఆగడాలలంకలో చెత్తనుంచి సంపద కేంద్రాలను సందర్శించిన జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

భీమడోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం భీమడోలు మండలంలో పర్యటించారు. తొలుత గుండుగొలను గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారిణి అనురాధతో కలిసి సందర్శించి కేంద్రం పనితీరును పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించిన వివరాలను జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ వర్మికంపోస్టు ఎరువు తయారీ విధానం, యంత్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఆగడాల లంక, మల్లవరం, చెట్టున్నపాడులోని మంచినీటి చెరువులను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా రానున్న వేసవి సమయాల్లో గ్రామాల్లో సాగునీరు ఇబ్బందులను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతిదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా చైతన్య యాత్ర



కౌండిన్యముక్తిలో నిర్వహిస్తున్న ప్రజాచైతన్య యాత్ర

ఏలూరు కార్పొరేషన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కుమ్మరిరేవు, లంకపేట ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్రను నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సీపీఎం నగర కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా బుధవారం ఏలూరులో నిర్వహించామని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాకు, కె.విజయలక్ష్మి, యేసుబాబు, బి.సోమయ్య, ఎస్.సత్యనారాయణ, జి.శివకుమార్, ఎం.సత్యనారాయణ, దుర్గారావు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

● కుక్కునూరు : పోలవరం నిర్వాసితుల సమస్యలపై బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రను ప్రారంభించారు. కౌండిన్యముక్తి గ్రామంలో నిర్వాసితులతో కలిసి యాత్రను ప్రారంభించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపు గ్రామాల జాబితాలో కొన్ని గ్రామాలను చేర్చకపోవడం సరికాదని సీపీఎం జిల్లా నాయకులు వై.నాగేంద్రరావు ఆరోపించారు. ఏటా గోదావరి వరదలకు కౌండిన్యముక్తి గ్రామం ముంపునకు గురవుతున్న ఆ గ్రామాన్ని నిర్వాసిత గ్రామాల జాబితాలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై.సాయికిరణ్, కౌండిన్యముక్తి గ్రామస్థులు పాల్గొన్నారు.

● టినర్సాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికల సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించిన ప్రజా చైతన్య పాదయాత్రలో యాత్ర బృందానికి ప్రజల నుంచి అందిన సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం, ప్రధాన సెంటర్లలో సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు.

సూపర్-6 కచ్చితంగా అమలు చేస్తాం

ఏలూరు టూటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు సూపర్ - 6 పథకాలను అమలు చేసితీరుతామని ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య(చంటి) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన హామీలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో బొద్దాని శ్రీనివాస్, త్రిపర్ణరాజేష్, చిరంజీవి పాల్గొన్నారు.

పోలవరం ఎంపీడీవోగా చెరుకూరి శ్రీనివాస్



పోలవరం, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా పోలవరం గ్రామానికి చెందిన చెరుకూరి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ సీఈవో ఆదేశాల మేరకు ఏవోగా పనిచేస్తున్న చెరుకూరి శ్రీనివాస్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన పోలవరం ఇంచార్జి ఎంపీడీవోగా పనిచేశారు. ఎంపీడీవోగా బాధ్యలు స్వీకరించడం పట్ల పలువురు నాయకులు అధికారులు శ్రీనివాస్‌కి శుభాకాంక్షలు తెలిపారు.



కంప్యూటర్, ప్రింటర్, బీరువా అందజేస్తున్న దృశ్యం

పాఠశాలకు అడ్వాన్టా వితరణ

పెదవేగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : అడ్వాన్టా మొక్కజొన్న సంస్థ సేవలు అభినందనీయమని జనసేన నాయకుడు, ఏలూరు ఎన్ స్క్వేర్ హోటల్ అధినేత నారా శేష అన్నారు. అడ్వాన్టా మొక్కజొన్న విత్తన సంస్థ పెదవేగి మండలం నడిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్, బీరువాలను బహూకరించారు. జనసేన నాయకుడు నారా శేషు బుధవారం జరిగిన కార్యక్రమంలో వాటిని పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకా అప్పాయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న మణి కుమార్

సీఆర్ఆర్‌లో ఘనంగా టెక్ ఫెస్ట్

పెదపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : కళాశాలల్లో నిర్వహించే టెక్ ఫెస్ట్‌ల ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆవిష్కరణలు సమాజానికి తెలుస్తాయని బీఎస్ ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ టి.ఎన్.వి.మణికుమార్ తెలిపారు.వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో టెక్ ఫెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మణి కుమార్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఈ టెక్ ఫెస్ట్‌లో రాష్ట్రంలోని, ఇతర రాష్ట్రాల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొనగా విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలతో కూడిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో కె.హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు,కో-కన్వీనర్స్ డాక్టరు తేజోమూర్తి, డాక్టరు శ్రీనివాసరెడ్డి, డాక్టరు రాంబాబు, డాక్టరు ప్రభాకరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న బాలిక(14)ను ఎన్.ప్రదీప్ కుమార్ అనే యువకుడు ఏలూరు తీసుకెళ్లి నిర్బంధించి లైంగికదాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందడంతో పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.కె.జబీర్ తెలిపారు. గత నెల 25న బాలిక ఇంటి నుంచి దుకాణానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో అంతటా గాలించారు.ఏలూరులోని ప్రదీప్ కుమార్ సోదరి వద్ద బాలిక ఉందని తెలుసుకుని ఈ నెల 18న ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత ఏం జరిగిందని తల్లి బాలికను ప్రశ్నించగా ప్రదీప్ కుమార్ తనను బలవంతంగా ఏలూరు తీసుకెళ్లి ఓ ఇంట్లో నిర్బంధించి లైంగికదాడికి పాల్పడ్డాడని తెలిపింది. ఇదే విషయాన్ని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. తెలిపారు.

దాడిలో గాయపడిన బోసు ఆస్పత్రిలో మృతి



బోసు(ఫైల్)

జీలుగుమిల్లి, మార్చి, 17: (ఆంధ్రజ్యోతి) : తాటియాకులగూడెంలో గంధం బోసు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం దాడి చేసిన విషయం తలిసిందే.. ఈ దాడిలో తలకు తీవ్ర గాయమైన బాధితుడు గంధం బోసు తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బుధవారం ఆస్పత్రిలో వైద్యం పొందుతూ బోసు(37) మృతి చెందాడు. ఈ విషయమై పోలీసులు పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు. కేసుకు సంబంధించి పలువురు అనుమానితుల్ని విచారణ జరుపుతున్నారు. పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరరావు, సీఐలు బాలసురేష్‌బాబు, వెంటేశ్వరావు, ఎస్సై నవీన్ కుమార్‌ల ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. మృతుడు బోసుకు భార్య శాంతి, పది సంవత్సరాల కుమారుడు చెర్రి, కుమార్తె ఆరాధ్య ఉన్నారు.

జాబ్ మేళాలో 37 మంది ఎంపిక

ఏలూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు డీఎల్‌టీసీ ఐటిఐ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 37 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 41 మంది హాజరు కాగా, ఇందులో టీవీఎస్ షోరూమ్, వివిధ కంపెనీల ప్రతినిధులు 37 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏడీ ఎస్.ఉగాది రవి, ఈవో వి.జి.వరలక్ష్మి, ప్రవీణ్ కృష్ణ, కె.ప్రవీణ్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సునీల్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెదపాడు, మార్చి19(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈ మేరకు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు మాట్లాడుతూ 80 రోజులకు గాను హుండీ ఆదాయం 12లక్షల 8వేల 963 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపును ఏలూరు జిల్లా పర్యవేక్షణాధికారి సురేష్ కుమార్ పరిశీలించారు.

యాకోబుకు న్యాయం చేయాలి

బుట్టాయగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గిరిజనుడు మడకం యాకోబుపై దాడిచేసి గాయపరచిన అటవీ శాఖ అధికారులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ మాజీ నాయకుడు ఎస్.రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాకోబు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేసి ఆదుకోవాలని తెలిపారు. దాడి చేసినవారిపై కేసులు పెట్టినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. యాకోబు కేసును నీరుగార్చడానికి రాజకీయ పెద్దలు రంగంలోకి దిగి రాజీప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారని అటువంటివారిపై ఆదివాసీలు తిరగబడతారని హెచ్చరించారు.

నిర్వాసితులను ఆదుకోవాలి

బుట్టాయగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమైందని కాంగ్రెస్ పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జీ బండి విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం బుట్టాయగూడెంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా ఆదేశాల మేరకు ఏజెన్సీలో పర్యటించి గిరిజనులు, నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాటాలకు కాంగ్రెస్ సిద్ధపడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ కుటుంబరావు, కె.రాజారత్నం, కంగాల శ్రీరామ్, దారం సత్తిరాజు, ఏసుపాదం పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

బుట్టాయగూడెం, మార్చి19(ఆంధ్రజ్యోతి) : అర్హులందరకు ఓటు హక్కును కల్పించడానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పూర్తి సహకారం అందించాలని ఆర్డీవో రమణ కోరారు.బుధవారం బుట్టాయగూడెం రెవెన్యూ కార్యాలయంలో అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు తెలుసున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్ర పటం వద్ద నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

జంగారెడ్డిగూడెం, మార్చి19(ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా 58 అడుగుల విగ్రహాన్ని అమరావతిలో నిర్మిస్తానని ప్రకటించిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పట్టణ ఆర్యవైశ్యులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకుడు మహంకాళి రామ్మోహనరావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి..

కొయ్యలగూడెం : మీసేవా కేంద్రాల మనుగడకు ఆపరేటర్ల భవిష్యత్తుపై నారా లోకేశ్ ఇచ్చిన హామీకి కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ మేరకు బుధవారం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో మీసేవా నిర్వహకులంతా కృతజ్ఞతలు తెలిపారు. ఆసెంబ్లీ సాక్షిగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీతో తమకెంతో మేలు జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి మీసేవా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి,మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు. అనంతరం దేవస్థానంలో షష్ఠి కల్యాణ మహోత్సవాలకు పూజా ద్రవ్యాలు సరఫరా చేసేందుకు తలనీలాలు పోగు చేసుకునేందుకు, భక్తుల నుంచి కానుకలుగా వచ్చిన బియ్యం కొనుగోలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు అన్నవరం ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ముదినేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరం ఫీడర్ ఏరియాలో చెట్లు నరికే పనులు నిర్వహిస్తున్నందున గురువారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ పూర్ణ చంద్రరావు తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గృహ, వాణిజ్య, ఆక్వా, విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.



క్రికెటర్ కామినేని

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రజలకు క్రికెటర్ కామినేనిగా కనిపించారు. బడ్జెట్ సమావేశాల అనంతరం ఎమ్మెల్యేలకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో కామినేని క్రికెట్ ఆడుతున్న దృశ్యాలు ప్రచార మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి.

- కైకలూరు, ఆంధ్రజ్యోతి

ప్రోబ్లమ్ జోన్



మురికి కూపంలా ముదినేపల్లి శ్మశాన వాటిక పరిసరాలు

ముదినేపల్లి శ్మశాన వాటిక అధ్వానం

ముదినేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని శ్మశాన వాటిక పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. శ్మశాన వాటిక ప్రహరీ పొడవునా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన డ్రెయిన్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో శ్మశాన వాటికలోకి మృత దేహాలను తీసుకెళ్లే రోడ్డు ధ్వంసమైంది. పాడె మోసుకుంటూ నలుగురు లోపలికి వెళ్లడం ఇబ్బందికరంగా ఉంది. జాతీయ రహదారి పక్కన డ్రెయిన్ మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు చర్యలు తీసుకుని శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనులతో

గ్రామాలకు రాకపోకలు బంద్

మండవల్లి గ్రామస్థుల ఆగ్రహం



రాకపోకలు నిలుపుదలపై మండిపడుతున్న ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్ ప్రసాద్

మండవల్లి మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 165జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన రోడ్డు పనులతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పనుల తీరుపై మండవల్లి గ్రామస్థులు బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి నుంచి మండవల్లి మీదుగా ఇంగిలిపాకలంక వెళ్లే రోడ్డు వద్ద డ్రెయినేజీ నిర్మాణ పనుల నిమిత్తం రాకపోకలు నిలిపివేశారు. డ్రెయినేజీ తవ్వకం పనులుకూడా చేపట్టారు. జాతీయ రహదారి నుంచి కైకలూరు సందుగా పిలువబడే రోడ్డులో లంక, మండవల్లి గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం అకస్మాత్తుగా కైకలూరు సందుగా పిలువబడే రోడ్డును నిర్మాణ పనుల నిమిత్తం తవ్వకం చేయడంతో లంక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామంలో కనీసం కారు, ఆటోలు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడడంతో గ్రామస్థులు ఒక్కసారిగా మండిపడ్డారు. మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, పలువురు గ్రామస్థులు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్ట్ సిబ్బందిపై మండిపడ్డారు. పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో కైకలూరు సందు రోడ్డు నిర్మాణ పనుల వద్దకు చేరుకొని కాంట్రాక్టు సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం చేశారు. రోడ్డు ఇష్టం వచ్చినట్లు రహదారులు లేకుండా నిర్లక్ష్యంగా పనులు చేయడం ఎలా అంటూ పెద్దిరెడ్డి ప్రశ్నించారు.

ఇదే రోడ్డులో ఆక్వా చేపలచెరువులో ఉండడం వల్ల మేతలు మందులుతో పాటు ప్రజలు రాకపోకలు సాగించవలసి ఉందని ఎవరికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా రహదారులు పూర్తిగా నిలిపివేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే ఒక రోడ్డును పునఃరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టు సిబ్బంది సుమక్షత వ్యక్తం చేయడంతో శాంతించారు. తక్షణమే ఒక రోడ్డు తర్వాత మరో రోడ్డు రాకపోకలు నిలుపుదల చేసుకోమని పెద్దిరెడ్డి చెప్పారు.



కైకలూరులో సదరం శిబిరానికి హాజరైన దివ్యాంగులు

కైకలూరులో సదరం శిబిరం

కైకలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సదరం సర్టిఫికెట్ జారీ చేస్తామని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వైద్యుడు ప్రశాంత్ అన్నారు. బుధవారం కైకలూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో సదరం క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మందికి పరీక్షలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ దివ్యాంగుల వైకల్యాన్ని బట్టి సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని ప్రభుత్వ నిబంధనలకు లోబడి వారి వైకల్యాన్ని గుర్తిస్తామన్నారు.

ఆర్థిక గణనకు జిల్లా కమిటీ

ఏలూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక గణన నిర్వహణకు కలెక్టర్ వెట్రి సెల్వి జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. వచ్చే నెల నుంచి జరిగే గణనకు చైర్‌ఎర్సన్‌గా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా సీపీవో ఉంటారు. ఎస్పీ, మునిసిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు



ముసునూరులో సర్వే చేస్తున్న అధికారులు

గ్రామాల్లో వర్క్‌ఫ్రం హోమ్ సర్వే

ముసునూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల వారి ఆదాయ మార్గం పెంపొందించడానికి ప్రభుత్వం వర్క్‌ఫ్రం హోమ్ సర్వే చేపట్టింది. ఐటీ, అనుబంధ రంగాలలో యువత, గృహిణులకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. మండలంలో సర్వే వేగంగా జరుగుతోంది. 16 గ్రామ పంచాయతీల పరిధిలో 13,754 కుటుంబాలు ఉండగా, కనీసం 13వేల మందికి వర్క్‌ఫ్రం హోమ్ ద్వారా పనులు కల్పించాలని లక్ష్యం. ప్రస్తుతం 50శాతం సర్వే పూర్తికాగా ఈ నెల 23 నాటికి సర్వే పూర్తి కావాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ బీఏ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు మ్యాపింగ్ చేసిన ప్రతి కుటుంబాన్ని కలిసి వర్క్‌ఫ్రం హోమ్ సర్వేచేసి వివరాలను నమోదు చేస్తున్నారు. విద్యావంతులు, నిరక్ష్యరాస్యులు రెండు కేటగిరీలుగా సర్వే కొనసాగుతుంది.

ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్ కొనసాగిస్తాం

కృష్ణా యూనివర్సిటీ వీసీ రాంజీ



పీజీ సెంటర్‌లో నూతన భవనాలు పరిశీలిస్తున్న వీసీ తదితరులు

నూజివీడు టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నూజివీడులో ఎంఆర్ అప్పారావు కాలేజి ఫర్ పీజీ స్టడీస్‌ను ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌గానే కొనసాగిస్తామని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.రాంజీ అన్నారు. ఎంఆర్ అప్పారావు కాలేజి ఫర్ పీజీ స్టడీస్‌ను బుధవారం ఆయన సందర్శించారు. నూజివీడు పరిసర ప్రాంతాలలో విద్యా ప్రదాత, మాజీ మంత్రి, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంఆర్ అప్పారావు హయాంలోనే సువిశాల ప్రాంగణాన్ని భవనాలతో సహా యూనివర్సిటీకి అందజేశారు. పీజీ సెంటర్‌ను స్టడీ సెంటర్‌గా మార్చి స్పెషల్ ఆఫీసర్ స్థాయి నుంచి ప్రిన్సిపాల్ స్థాయికి తగ్గించిన విషయాన్ని పలవురు వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. క్యాంపస్ డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌గానే కొనసాగుతుందన్నారు. పీజీ సెంటర్‌లో సౌకర్యాలు, నిర్మాణం పూర్తయిన భవనాలను ఆయన పరిశీలించారు. బాలికల వసతి గృహంలోని సౌకర్యాలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పీజీ సెంటర్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు రూపొందించి నివేదిక అందించాలని అధికారులను వీసీ ఆదేశించారు.

కొత్త కోర్సులు తెస్తాం

విద్యార్థుల అభీష్టం మేరకు కొత్త కోర్సులు తీసుకువస్తామని వీసీ తెలిపారు. నూజివీడు పరిసర ప్రాంతాలలో ఉద్యాన పంటలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వాటికి సంబంధించిన కోర్సులు విద్యార్థులు కోరితే తప్పనిసరిగా అందుబాటులోకి తీసుకువస్తామని వీసీ స్పష్టం చేశారు. అయితే కొత్త కోర్సులు తెస్తే కనీసం ఐదేళ్లు కొనసాగాలన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

మొదటి సంవత్సరంలో రెండు నెలల ఇంటర్న్‌షిప్ ఏర్పాటుచేస్తామని వైస్ చాన్సలర్ రాంజీ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాలను దత్తత తీసుకొని, అక్కడి సమస్యలు తెలుసుకొని సమస్యలు పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో రెక్టర్ ఎంవీ బసవేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ జె నవీన లావణ్య, లత, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విదేశీ దిగుమతులు తగ్గించడానికి కేంద్రం చర్యలు

ఎంపీ మహేశ్‌కుమార్

ఏలూరు టూటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విదేశీ ఉత్పత్తుల దిగుమతులు తగ్గించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. లోక్‌సభలో ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి జిత్తిన్ ప్రసాద్ సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ ఔషధాలు, టెలికాం, పవర్ వంటి వేగంగా విస్తరిస్తున్న రంగాల అవసరాలు తీర్చడానికి కేంద్రం దిగుమతులపై ఆధారపడిందని మంత్రి సమాధానం ఇచ్చారు. దిగుమతులు తగ్గించుకోడానికి దేశీయ ఉత్పత్తులను పెంచేందుకు మేకిన్ ఇండియా కార్యక్రమంలో కేంద్రం అనేక చర్యలు చేపట్టిందన్నారు. చైనా ఉత్పత్తుల దిగుమతిని ఐదేళ్లలో తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి సమాధానం ఇచ్చారు.



చనుబండలో అసంపూర్తిగా ఉన్న ఇల్లు

పేదల ఇళ్లకు అదనపు సాయం

చాట్రాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కార్ హయాంలో ఆర్థిక ఇబ్బందులతో అసంపూర్తిగా ఆగిపోయిన పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందించనుంది. మండలంలోని ఇళ్ల లబ్ధిదారుల్లో ఎస్సీలు 440, ఎస్టీలు 36, బీసీలు 133 మొత్తం 609 ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనంగా నిధులు విడుదల చేస్తారని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గృహాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, రవికుమార్ చెప్పారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ఏర్పాట్లు

చాట్రాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శివారు సూరంపాలెం దళితవాడలో ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి టీడీపీ నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నక్కారాము, జక్కంపూడి ప్రదీప్, మారేశ్వరరావు, బ్రహ్మయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చాట్రాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చాట్రాయి గ్రామ సచివాలయం వద్ద చలివేంద్రాన్ని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్ఐ వెంకట రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

ముసునూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి రిక్షాలు, ట్రాక్టర్ల ద్వారా సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. ముసునూరులో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు చెత్త సేకరణ పర్యవేక్షించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

బీఎల్‌వోలుగా స్థానికులను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాజ్

నూజివీడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బూత్ లెవెల్ అధికారులుగా స్థానికులనే నియమించాలని నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. స్థానికులైతే ఎన్నికల సమయంలో ఓటర్ స్లిప్‌లు సక్రమంగా అందజేస్తారన్నారు. వివిధ రాజకీయ పక్షాల నాయకులతో సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు బుధవారం సమావేశమయ్యారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో వసతుల మెరుగుదలకు సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో 286 పోలింగ్ స్టేషన్లు ఉండగా గ్రామీణ ప్రాంతాలలో 1200 ఓటర్లు, పట్టణ ప్రాంతాలలో 1400 ఓటర్లకు మించి ఉంటే తన దృషికి తీసుకురావాలన్నారు. పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ 176, 121 పోలింగ్‌స్టేషన్లలో గత ఎన్నికలలో వెంటిలేషన్ సరిగా లేక వృద్ధులు ఓటువేసేందుకు ఇబ్బందులు పడ్డారన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీ సింగ్, బీజేపీ నాయకులు జీఆర్‌కే రంగారావు, బోను అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



ఫోన్‌లో శక్తియాప్‌ను ఉపయోగించే విధానాన్ని విద్యార్థినులకు వివరిస్తున్న పోలీసులు

మహిళల భద్రతకు ప్రభుత్వ ప్రాధాన్యం

కైకలూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని టౌన్ సీఐ కృష్ణ అన్నారు. వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఫోన్ యాప్‌లో ఎస్ఓఎస్ అలర్ట్ బటన్ నొక్కితే పోలీసులకు సందేశం వెళుతుందని, లోకేషన్ ట్రాకింగ్‌తో అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ కంట్రోలింగ్ రూమ్ ద్వారా మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందిస్తారన్నారు. యాప్‌ను విద్యార్థులందరూ వినియోగించుకోవాలని, వారి ఇళ్లలో మహిళలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వై.జ్ఞాన ప్రసూనాంబ, అధ్యాపక బృందం, శక్తి యాప్ టీం సభ్యులు ఎల్.స్వప్న, టి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం



గోపవరంలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ముసునూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య అన్నారు. నవోదయం 2.0లో భాగంగా కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల, గోపవరం, ముసునూరు గ్రామాల్లో ప్రచార రథం ద్వారా బుధవారం ప్రజలకు అవగహన కల్పించారు. సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీ, రవాణా, విక్ర యాలు సాగిస్తున్న వారి వివరాలు కమిటీల ద్వారా తెలియజేయాలన్నారు. అనంతరం చింతలవల్లికి చెందిన పల్లెపాము పద్మ కుమార్, చెక్కపల్లికి చెందిన తాళం రాజు, వేల్పుచర్లకు చెందిన వడిత్యా పెద్ద లక్ష్మి, గుళ్ళపూడికి చెందిన నారి పెళ్ళ సత్యవతి, చిల్లబోయినపల్లికి చెందిన మరీదు నాగబాబును తహసీల్దార్ కె.రాజ్ కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. మరోసారి ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయల జరిమానా, ప్రభుత్వ పథకాలు రద్దు చేయడం జరుగుతుందని తహసీల్దార్ హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

11 మంది బైండోవర్

చాట్రాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్సైజ్ కేసుల్లో పాత నిందితులు 11 మందిని బుధవారం తహసీల్దార్ గీత ఎదుట ఎక్సైజ్ పోలీసులు హాజరుపర్చి బైండోవర్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బైండోవర్ కాల పరిమితి ఏడాది ఉం టుందని ఈలోగా నేరాలకు పాల్పడితే రూ లక్ష జరిమానా విధించడంతో పాటు సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. సారా వ్యాపారం చేస్తూ చట్టం దృష్టిలో నేరస్తులుగా మిగిలిపోవద్దని మంచి వృత్తులు చేసుకుంటూ గౌరవంగా బతకాలని నిందితులకు తహసీల్దార్ కౌన్సెలింగ్ ఇచ్చారు.



స్వాగతం పలుకుతున్న మంత్రి సారథి

మంత్రి నారా లోకేశ్‌కు అపూర్వ స్వాగతం

నూజివీడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గన్నవరం నియోజవర్గం బాపులపాడు మండలం మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ కంపెనీ ప్రారంభోత్సవానికి వెళుతున్న మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు నేతలు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మర్రిబంధం, సీతారాంపురం గ్రామాల వద్ద పోలవరం కాలువ వారధి కూడలిలో బుధవారం భారీ గజమాలతో గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నారా లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు.

సబ్సిడీ మినుము విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

కలిదిండి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటల్లో అంతర పంటగా వేసుకునేందుకు మినుము, పెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి విద్యా సాగర్ అన్నారు. బుధవారం వెంకటాపురం, కొండూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వెంకటాపురం సొసైటీలో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, క్వింటా మినుము రూ.7400 నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులకు బయట మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక పోతే మినుము కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. వెంకటాపురం సొసైటీ కార్యదర్శి గుడిపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఫణీంద్ర, రైతులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షకు పలువురి గైర్హాజరు

కలిదిండి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలంలో కోరుకొల్లు, కలిదిండి, ఆరుతెగలపాడు, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి హిందీ పరీక్షకు 9 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 831 మంది విద్యార్థులకు 822 మంది హాజరయ్యారన్నారు. కోరుకొల్లు జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని సమస్యాత్మకంగా గుర్తించడంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● ముదినేపల్లి: మండలంలో హిందీ పరీక్షకు 99.35 శాతం మంది హాజరయ్యారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో 624 మంది హాజరు కావాల్సి ఉండగా 620 మంది రాశారు. నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.

● ముసునూరు: మండలంలో హిందీ పరీక్షకు 593 మందికి 582 హాజరుకాగా 11మంది గైర్హాజరయ్యారని ఎంఈవో బీవీ ఎస్.సుబ్బారావు తెలిపారు. ముసునూరులో 194 మందికి 190మంది, గోపవరంలో 119 మందికి 117మంది, చెక్కపల్లిలో 280మందికి 275మంది పరీక్ష రాసినట్లు తెలిపారు.

● చాట్రాయి: జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 280 మందికి ఒక్కరు, ఆర్సీఎం పరీక్షా కేంద్రంలో 159 మందికి ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు వాటర్ కూలర్

చాట్రాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పోలీస్‌స్టేషన్‌కు మాల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం వాటర్ కూలర్ అందజేశారు. వేసవిలో పోలీస్‌స్టేషన్ సిబ్బందికి, ప్రజలకు తాగునీటి సౌకర్యం నిమిత్తం కూలర్ అందజేసినట్లు నాయకులు చెప్పారు. మాల సంఘం నాయకులను ఎస్సై రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నక్కా రాము, దారా రాజు, బుర్రి రమేశ్, విజయరాజు, సురేష్‌బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లతో కాలక్షేపం

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం.. అవస్థలు పడుతున్న ప్రజలు

ముదినేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో ఇన్‌చార్జ్ కార్యదర్శుల పాలన కొన సాగుతూనే ఉంది. ఒక్కో కార్యదర్శి రెండు నుంచి ఐదు పంచాయతీల బాధ్యతలను నిర్వహించాల్సి వస్తున్నది. మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా, వీటిలో 8 మేజర్ గ్రామ పంచాయతీలు, 24 మైనర్ పంచాయతీలు ఉన్నాయి. ఏళ్ల తరబడి మేజర్ పంచాయతీలకు కూడా రెగ్యులర్ కార్యదర్శులు లేరు. మండలంలోని ముగ్గురు కార్యదర్శులకు మూడేసి పంచాయతీలు, ఒక కార్యదర్శికి అందులోను మహిళకు ఐదు పంచాయతీలు, ఒక కార్యదర్శికి నాలుగు, ఐదుగురు కార్యదర్శులకు రెండేసి పంచాయతీల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వాడవల్లి కార్యదర్శికి ఆరు కిలోమీటర్ల దూరంలోని చేవూరుకు ఇన్‌చార్జ్‌గా కోమర్రు పంచాయతీ కార్యదర్శికి 7 కిలోమీటర్ల దూరంలో చినకామనపూడి ఇన్‌చార్జ్‌గా, పెద కామనపూడి కార్యదర్శికి పక్కనే ఉన్న చిగురుకోటతో పాటు ఐదు కిలోమీటర్ల దూరంలోని శ్రీహరిపురం పంచాయతీకి ఇన్‌చార్జ్ నియమించారు. దీంతో వారికి ఇబ్బందికరంగా మారింది. పక్క పంచాయతీలకు అవకాశం ఉన్నప్పటికీ దూరంగా ఉన్న పంచాయతీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రజలకు కూడా అవస్థలు తప్పడం లేదు. మండలంలో 14 మంది కార్యదర్శులకు సమీప పంచాయతీల అదనపు బాధ్యతలను అప్పగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ముదినేపల్లి మేజర్ పంచాయతీకి కూడా ఏళ్ల తరబడి ఇన్‌చార్జ్ కార్యదర్శి పాలన తప్పడం లేదు.



ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం